సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం । 8 । డిసెంబర్ । 2024



అమలు కాని మెనూ!

జిల్లాలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూ పూర్తిస్థాయిలో అమలు కాక విద్యార్థులు ఇంటి భోజనంపైనే మక్కువ చూపుతున్నారు. 8లో



కేంద్రాల్లోనే విక్రయించాలి

ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ రైతులకు సూచించారు. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 22°

వాతావరణం

జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం, రాత్రి వేళల్లో వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున అంతరాలయంలో మూలమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన స్వామి వారిని పల్లకీ సేవగా బేడా మండపానికి తీసుకొచ్చారు. అర్చకులు ముందుగా ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ తంతును కన్నులపండువగా జరిపించారు. స్వామి వారిని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి భక్తులు శనివారం విరాళం అందజేశారు. ప్రకాశం జిల్లా బాల వెంకటాపురం గ్రామానికి చెందిన బోయల కోనరెడ్డి, వెంకటరత్నం దంపతులు రూ.లక్ష, హైదరాబాద్ జూబ్లీహిల్స్‌కు చెందిన అజయ్‌కుమార్– విజయలక్ష్మి దంపతులు రూ.లక్ష చొప్పున చెక్కులను అందించగా, ఆలయ అధికారులు వారికి రసీదులు ఇచ్చారు. అనంతరం దాతలు కుటుంబసభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు.

పంచాయతీ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం

డీపీఓ చంద్రమౌళి

ఇల్లెందురూరల్: ప్రభుత్వం ఎప్పుడు నోటిఫికేషన్ విడుదల చేసినా పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి తెలిపారు. మండలంలోని పూబెల్లిలో పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల వివరాలను పరిశీలించారు. గ్రామపంచాయతీ ఆవరణలో నాటిన ఔషధ మొక్కలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికలకు కోసం ఓటర్ల జాబితా సిద్ధం చేశామని, వార్డుల వారీగా విభజన ప్రక్రియ కూడా పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ చిరంజీవి, కార్యదర్శి రేళ్ల బాలకృష్ణ పాల్గొన్నారు.

నేటి పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలో ఖాళీగా ఉన్న స్టెనో, టైపిస్ట్ కమ్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి సింగరేణి మహిళా కాలేజీలో ఆదివారం రాత పరీక్ష నిర్వహిస్తున్నామని, ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పాటిల్ వసంత్ తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహణకు చర్యలు చేపట్టామని చెప్పారు. ఆయన వెంట సంస్థ కార్యదర్శి బి.రామారావు తదితరులు ఉన్నారు.

జూలూరుపాడు ఎస్సైపై సస్పెన్షన్ వేటు

జూలూరుపాడు: జూలూరుపాడు ఎస్సై బి.రాణాప్రతాప్‌ను సస్పెండ్ చేస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించిన సమయంలో ఓ కేసు విషయంలో అధికార దుర్వినియోగానికి పాల్పడి కోర్టుకు తప్పుడు సమాచారం అందించడాన్ని తీవ్రంగా పరిగణించిన ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారు.

వ్యర్థాల వినియోగంపై అవగాహన కల్పించాలి

కొత్తగూడెంఅర్బన్: వ్యర్థ పదార్థాలతో పర్యావరణానికి విఘాతం ఏర్పడుతుందని, దీనిపై విద్యార్థులకు చిన్నతనం నుంచే అవగాహన కలిపించాలని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి, సింగరేణి విద్యాశాఖ కార్యదర్శి జి.శ్రీనివాస్ తెలిపారు. శనివారం కొత్తగూడెంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో ఎన్‌జీసీ ఆధ్వర్యంలో జరిగిన వేస్ట్ అండ్ వెల్త్ ఎగ్జిబిషన్‌లో వారు మాట్లాడారు. సమాజంలో పనికి రాని వస్తువులు పేరుకుపోయి గుట్టలుగా ఏర్పడి పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయని, దీంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి ఎస్.చలపతిరాజు, రాష్ట్ర పరిశీలకులు ఎం.రాజశేఖర్ తదితరులు పరిశీలించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్(ఎస్ఎస్ఏ) శ్రీనివాస్, జిల్లా కో–ఆర్డినేటర్ సంపత్‌కుమార్, సింగరేణి విద్యా విభాగం జాయింట్ సెక్రెటరీ సునీల్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం సాయిసుజాత పాల్గొన్నారు.

హల్దీ అదుర్స్!



పెళ్లి కూతురి హల్దీ వేడుకలో పాల్గొన్న బంధువులు, స్నేహితులు



సండే స్పెషల్

వివాహ వేడుకల్లో హల్దీ ఫంక్షన్లు ట్రెండ్‌గా మారాయి. పెళ్లికి ఒకరోజు ముందు వధూవరులకు మంగళ స్నానాలు చేయించడం అనాదిగా వస్తున్న ఆచారం. అయితే 2018 చివరి నుంచి ఇది కొత్తపుంతలు తొక్కి హల్దీ ఫంక్షన్‌గా మారి పెళ్లి వేడుకలో ప్రత్యేకంగా నిలుస్తోంది. ప్రస్తుతం హల్దీ వేడుకలు ఎప్పుడూ గుర్తుండిపోయేలా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. హల్దీ ఈవెంట్‌లో వధూవరులతో పాటు బంధువులు, స్నేహితులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. – భద్రాచలంఅర్బన్

డ్రెస్ కోడ్‌తో వేడుకలు..

హల్దీ ఫంక్షన్లలో పాల్గొనే వారు ఒకే రకమైన డ్రెస్ కోడ్‌తో వేడుకల్లో పాల్గొంటున్నారు. పురుషులు ఎక్కువగా పసుపు రంగు లాల్చీ, తెల్ల ప్యాంట్.. మహిళలు పసుపు రంగు చీరలు ధరిస్తారు. ఇంకొందరు మెరూన్, బ్లూ, ఆరెంజ్ తదితర రంగుల డ్రెస్‌లు వాడుతున్నారు. వేడుకల్లో పెళ్లి కూతురు, పెళ్లి కుమారుడికి ఎవరి ఇళ్లలో వారు వేర్వేరుగా వేడుకలు నిర్వహిస్తున్నారు. పసుపు నీటితో మంగళస్నానం చేయిస్తారు.



పెళ్లి కూతురికి మంగళస్నానం చేయిస్తున్న దృశ్యం

- వివాహ వేడుకల్లో ట్రెండ్
- ప్రత్యేక ఆకర్షణగా డ్రెస్ కోడ్
- ఉత్సాహంగా పాల్గొంటున్న బంధువులు, స్నేహితులు

రూ.10వేల నుంచి రూ.50వేల వరకు ఖర్చు..

హల్దీ వేడుకల ఈవెంట్స్ కోసం ప్రత్యేక సెట్టింగ్‌లు అందుబాటులోకి వచ్చాయి. రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు సెట్టింగ్‌లకు ఖర్చవుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. హల్దీ ఫంక్షన్‌లో పెళ్లి కూతురు కూర్చోడానికి తామరపూవు, పెళ్లి కుమారుడికి బాహుబలి తోఫా సెట్టింగ్ వేస్తారు. గులాబీ, మల్లె, చామంతి వంటి రకరకాల పూలతో డెకరేట్ చేస్తారు. మంగళస్నానాలకు గంగాళాలు, జల్లెడ, రాగి లేదా ఇత్తడి చెంబు వాడతారు. వధూవరులకు పసుపు రాసిన అనంతరం గంగాళంలో పూలతో ఉన్న పసుపు నీళ్లను జల్లెడ ద్వారా పోసి చిరుజల్లులతో మంగళస్నానం చేయిస్తారు.

కళ్లు చెదిరేలా షూట్స్..

హల్దీ ఫంక్షన్ వేడుకల్లో ఫొటో, వీడియో షూట్ క్రేజీగా మారింది. హల్దీ ఈవెంట్‌ను జీవితాంతం గుర్తుండేలా ఫొటో, వీడియో గ్రాఫర్లు షూట్ చేస్తున్నారు. ఫొటో, వీడియో షూటింగ్‌లకు సైతం పెద్ద మొత్తంలో చార్జ్ చేస్తున్నారు.

ఉత్సాహాన్నిస్తాయి..



కొన్ని సంవత్సరాలుగా వివాహ వేడుకల్లో హల్దీ ఫంక్షన్ ప్రత్యేకంగా మారింది. దీంతో వేడుకల్లో ఫొటో, వీడియోగ్రఫీ ప్రాముఖ్యత సంతరించుకుంది. ఇప్పటి వరకు 50 వరకు హల్దీ ఈవెంట్స్ ఫొటో, వీడియో గ్రఫీ చేశా. హల్దీ వేడుకల షూట్స్ కొత్త ఉత్సాహాన్ని ఇస్తాయి.

– గొలుసు రాంబాబు, ఫొటోగ్రాఫర్, భద్రాచలం

ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి..



ఈ ఏడాది మా కూతురి పెళ్లిలో హల్దీ ఫంక్షన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పెళ్లి కూతురికి పసుపు రాసి.. బంధువులు, స్నేహితులు అందరూ పసుపు రాసుకొని మంగళస్నానం చేయించడం మరపురాని అనుభూతి.

– పత్తి కోటిరెడ్డి, సారపాక

చెప్పలేని ఆనందం..



ఇటీవలే నా వివాహం జరిగింది. హల్దీ ఫంక్షన్‌లో బంధువులు, స్నేహితులు కలిసి ఒకే కలర్ డ్రెస్ కోడ్ తో ఉత్సాహంగా పాల్గొనడం చెప్పలేని ఆనందాన్ని ఇచ్చింది. ఈ వేడుకలు జీవితంలో మరచిపోలేని మధురానుభూతిని ఇచ్చాయి.

– యోగానంద రెడ్డి, సారపాక

అదిరిపోయేలా సెట్టింగ్‌లు..



పెళ్లి వేడుకల్లో హల్దీ ఫంక్షన్ సెట్టింగ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. గ్రామాల్లో హల్దీ ఫంక్షన్ సెట్టింగ్‌కు రూ.10, 15 వేల వరకు, పట్టణాల్లో రూ. 20 వేల నుంచి రూ.50 వేల వరకు ఉంటుంది. ఇప్పటి వరకు సుమారు 100 వరకు సెట్టింగులు వేశాం.

– నాగరాజు, భద్రాచలం

కృష్ణసాగర్‌లో మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్



ప్రచార వాహనాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కలెక్టర్ జితేష్ వి పాటిల్ వెల్లడి

బూర్గంపాడు: బూర్గంపాడు మండలంలోని కృష్ణసాగర్‌లో మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాల నిర్మించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. కళాశాల నిర్మాణానికి అనువైన ప్రభుత్వ స్థలాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కృషితో మంజూరైన ఈ కళాశాలను ప్రస్తుతం మణుగూరులో నిర్వహిస్తున్నారని, శాశ్వత భవన నిర్మాణానికి పదెకరాల ప్రభుత్వ భూమి అవసరమైనందున కృష్ణసాగర్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల ఆవరణలో ఉన్న స్థలాన్ని పరిశీలించామని చెప్పారు. అయితే అది కూడా సరిపోకపోవడంతో ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల అధ్యాపకుల క్వార్టర్లను తొలగించి ఆ స్థలంలో పాలిటెక్నిక్ కళాశాల భవనం నిర్మించనున్నట్లు వివరించారు. అధ్యాపకులకు క్వార్టర్లు మరోచోట నిర్మిస్తామన్నారు. ఏజెన్సీ ప్రాంత గిరిజన విద్యార్థులు పదో తరగతి వరకు చదివి ఆ తర్వాత మానేస్తున్నారని, వారిని సాంకేతిక విద్యతో అభ్యున్నతిలోకి తీసుకొచ్చేందుకు జిల్లాలో మోడల్ గురుకుల పాలిటెక్నిక్ కళాశాల నిర్మిస్తున్నామని తెలిపారు. అనంతరం గిరిజన గురుకుల కళాశాల విద్యార్థులతో మాట్లాడి మెనూ ప్రకారం భోజనం అందుతోందా అని ఆరా తీశారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల ఆసక్తిని గమనించిన కలెక్టర్.. వారికి అవసరమైన క్రీడా సామగ్రిని అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ దేవదాస్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నాగముని నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

కొత్తగూడెంరూరల్ : క్షయ వ్యాధి నిర్మూలనకు అందరూ కృషిచేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. 100 రోజుల టీబీ క్యాంపెయిన్‌లో భాగంగా శనివారం ఆయన కలెక్టరేట్ వద్ద జెండా ఊపి ప్రచార వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలోని 347 జిల్లాల్లో ఈ క్యాంపెయిన్ జరుగుతోందని తెలిపారు. జిల్లాలో క్షయ వ్యాధి అనుమానితులను పరీక్షించడంతో పాటు ప్రజల్లో ఈ వ్యాధిపై ఉన్న అపోహలను తొలగించేలా ప్రచారం సాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ ఎల్.భాస్కర్‌నాయక్, హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి బాలాజీ, టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ సాయికళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏక సభ్య కమిషన్ ఈనెల 12న ఖమ్మం రానున్నట్లు కలెక్టర్ పాటిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కమిషన్ సభ్యుడు వినతులు స్వీకరిస్తారని, జిల్లాలోని ఎస్సీ కుల సంఘాల నాయకులు హాజరు కావాలని సూచించారు.

తీరిన 'చన్నీటి' కష్టాలు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణంలోని బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో చదివే 72 మంది విద్యార్థులు చలికాలంలో చన్నీటి స్నానం చేస్తూ ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించిన కలెక్టర్ పాటిల్ సోలార్ వాటర్ హీటర్ ఏర్పాటు చేయించారు. శనివారం వాటర్ హీటర్ పనితీరును పరిశీలించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టల్‌లో రూ.9.50 లక్షలతో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, టెండర్ పనులు కూడా పూర్తయ్యాయని, సోమవారం నుంచి పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్, ఎంఈఓ ప్రభుదయాళ్ ఉన్నారు.

గురుకుల కళాశాల సందర్శన..

అశ్వాపురం: మండలంలోని మిట్టగూడెం తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలను కలెక్టర్ జితేష్ వి పాటిల్ శనివారం సందర్శించారు. కళాశాలకు ఈనెల 9న ఢిల్లీ నుంచి రానున్న న్యాక్ బృందం మెరిట్ సర్టిఫికెట్ ఇస్తే కేంద్రం నుంచి భారీగా నిధులు విడుదలవుతాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ ముందస్తుగా కళాశాలను సందర్శించి ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో వేసిన ప్లాంటేషన్ మొక్కలు, కాలేజీ భవనం, తరగతి గదులు, ఆడిటోరియం, ల్యాబ్‌ను పరిశీలించారు. కళాశాలలో చేపట్టాల్సిన పనులపై ప్రిన్సిపాల్ అనూష, ఎంపీడీఓ వరప్రసాద్, ఏపీఓ సీతారాములు తదితరులకు పలు సూచనలు చేశారు.

ఉన్నత లక్ష్యాలపై దృష్టి పెట్టండి

- విద్యార్థులకు ఎస్పీ రోహిత్‌రాజ్ పిలుపు
- అట్టహాసంగా నవభారత్ పాఠశాల క్రీడోత్సవాలు



క్రీడలను ప్రారంభిస్తున్న ఎస్పీ తదితరులు

పాల్వంచ: చిరు ప్రాయం నుండే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలపై దృష్టి సారించాలని, సాధనకు తపన పడాలని ఎస్పీ రోహిత్‌రాజ్ సూచించారు. స్థానిక నవభారత్ పబ్లిక్ స్కూల్ 45వ వార్షిక క్రీడోత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించగా ఎస్పీ ప్రారంభించారు. విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడలు శారీరక, మానసిక స్థైర్యాన్ని నింపుతాయని చెప్పారు. ఈ పాఠశాలలో జరిగిన క్రీడలను చూస్తుంటే 1982లో ఢిల్లీలో జరిగిన ఏషియన్ క్రీడలు గుర్తొస్తున్నాయని వ్యాఖ్యానించారు. కాగా, విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ఆకృతుల పిరమిడ్లు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విజేతలకు ఎస్పీ బహుమతులు అందించారు. తొలుత సీబీఎస్ఈ క్లస్టర్ లెవల్ అండర్ –19 విభాగపు గోల్డ్ మెడలిస్ట్ టి.జ్ఞానవి క్రీడాజ్యోతిని వెలిగించారు. కార్యక్రమంలో రింగ్ టెన్నిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ కె.ఆర్.వి.శ్యాంసుందర్, నవ లిమిటెడ్ జీఎం ఎం.జీ.ఎం.ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎం.వి.శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎ.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

ఎస్పీని కలిసిన హోంగార్డులు

కొత్తగూడెంఅర్బన్: హోంగార్డుల రైజింగ్ డే సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వారి సంక్షేమానికి సంబంధించి కొన్ని ప్రకటనలు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో జిల్లా ఆర్‌ఐ సూచనల మేరకు శనివారం జిల్లా హోంగార్డ్స్ అసోసియేషన్ సభ్యులు ఎస్పీ రోహిత్‌రాజును మర్యాదపూర్వంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తమ సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఎస్పీకి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం

ఐటీడీఏ పీఓ రాహుల్



అగ్ని ప్రమాద బాధితుడికి చెక్కు అందిస్తున్న పీఓ

భద్రాచలంఅర్బన్ : గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులకు చదువు, నాణ్యమైన భోజనంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులకు పరుపులు, దిండ్లు సరఫరా టెండర్ ప్రక్రియను తన చాంబర్‌లో శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భద్రాచలం, ఖమ్మం, నల్గొండ, హైదరాబాద్, ఆదిలాబాద్ నుంచి 10 మంది టెండర్లు దాఖలు చేశారని, తక్కువ ధర కోట్ చేసిన ఏజెన్సీనికి సరఫరా బాధ్యత అప్పగిస్తామని తెలిపారు. టెండర్‌లో సూచించిన మేరకు పరుపులు, దిండ్లలో నాణ్యత పాటించాలని, లేదంటే ఏజెన్సీలను రద్దు చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ డీడీ మణెమ్మ, ఏటీడీఓలు నరసింహారావు, చంద్రమోహన్, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు నాటికి మ్యూజియం ప్రారంభించాలి

గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా వారు తయారుచేసిన కళాకృతులు విక్రయించి జీవనోపాధి పొందేలా చూడాలని పీఓ రాహుల్ అధికారులకు సూచించారు. ఇందుకోసం అన్ని హంగులతో కూడిన గిరిజన మ్యూజియంను ఈ నెలాఖరు నాటికి ప్రారంభించాలన్నారు. మ్యూజియం పనులను శనివారం పరిశీలించిన అనంతరం పీఓ మాట్లాడుతూ పర్యాటకుల కోసం నిర్మిస్తున్న కుటీరాలు, పిల్లలు ఆడుకునే క్రీడాస్థలం, బోటింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, డీడీ మణెమ్మ, ఎఫ్‌డీసీ ఉదయ్‌కుమార్, డీఈ హరీష్, పంచాయతీ ఈఓ శ్రీనివాస్, మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి, డిజైనర్ శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

దుమ్ముగూడెం: మండలంలోని నారాయణపేట గ్రామానికి చెందిన కూరం ప్రశాంత్ ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం కాగా, ఆ కుటుంబానికి ఐటీడీఏ నుంచి పీఓ రాహుల్ శనివారం ఆర్థిక సాయం అందజేశారు. తనకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం, కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే ప్రశాంత్ ఇల్లు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోగా నిరాశ్రయులయ్యారని, ఈ మేరకు ఐటీడీఏకు అర్జీ పెట్టుకోగా రూ.25 వేలు మంజూరయ్యాయని వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు దిశగా...

- విద్య, వైద్యం, వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి
- మౌలిక వసతుల కల్పనకు పెద్దమొత్తంలో నిధులు

ఏడాది పాలనపై వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా: ఎంతో నమ్మకంగా గెలిపించిన ప్రజల ఆశలు వమ్ముకాకుండా వారి సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నానని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ వెల్లడించారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలే కాక చెప్పని పనులు సైతం చేస్తూ నిత్యం ప్రజలకు అండగా నిలుస్తున్నానని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచి ఏడాది పూర్తయిన సందర్భంగా శనివారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎమ్మెల్యే వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే...

ఏడాదిగా ప్రజల కోసమే......

గెలిచిన ఏడాదిగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలో పూర్తి సమయం కేటాయిస్తున్నా. ఏళ్లుగా ఎదురుచూస్తున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా వైరా రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు ఎత్తిపోసేందుకు కేటాయించిన రూ.100 కోట్ల నిధులతో పనులు జరుగుతున్నాయి. అలాగే, వందేళ్ల పూర్తయిన వైరా రిజర్వాయర్ ఆధునికీకరణను దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి తర్వాత ఎవరూ పట్టించుకోలేదు. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ.42 కోట్లు మంజూరయ్యాయి. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పీఆర్ నుంచి రహదారుల నిర్మాణానికి రూ.50 కోట్లు, ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి రూ.25కోట్లు సాధించా. వైరా మున్సిపాలిటీ పరిధి వైరా – సోమవరం మధ్య రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్, డివైడర్లు, సైడ్ డ్రెయిన్ల నిర్మాణ పనులు రూ.12 కోట్ల వ్యయంతో జరుగుతున్నాయి. ఐటీడీఏ ద్వారా కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు మండలాల్లో రూ.9 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాం.

మౌలిక సదుపాయాల కల్పన

నియోజకవర్గ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేలా మంత్రుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తున్నా. వచ్చే నాలుగేళ్లలోనూ మరిన్ని నిధులు తీసుకొస్తా. వైరా రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేలా రిసార్టులు, హోటళ్లు, రిక్రియేషన్ క్లబ్‌ల నిర్మాణం, స్పీడ్ బోట్ల ఏర్పాటుకు రూ.100 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 100కోట్లు కేటాయిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినందున ఈ నిధులతో రహదారులు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, కమ్యూనిటీ హాళ్లు, పార్కుల నిర్మాణం చేపడుతాం. కొణిజర్ల మండలం తనికెళ్ల నుండి వైరా మున్సిపాలిటీ పరిధిలోని గండుగలపాడు సాయిబాబా ఆలయం వరకు రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్, డివైడర్ల నిర్మాణానికి రూ.50 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. పల్లిపాడు నుండి ఏన్కూరు మధ్య ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేస్తా. వైరాలో 20 ఎకరాల విస్తీర్ణంలో రూ.125కోట్లతో శంకుస్థాపన జరగనుంది. సీతారామ ప్రాజెక్టు ద్వారా కారేపల్లి మండలంలో అన్ని చెరువులకు గోదావరి జలాలు తరలించే పనులకు రూ.200 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు రూపొందించాం. అలాగే, జూలూరుపాడు మండలంలోని అన్ని గ్రామాలకు సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల ద్వారా సాగునీరు ఇవ్వడంతో పాటు నియోజవర్గ కేంద్రంలో అగ్రికల్చరల్ పాలిటెక్నికల్ కళాశాల, డిగ్రీ, నర్సింగ్, ఐటీఐ ఏర్పాటుచేయాలని ప్రభుత్వాన్ని కోరాను. కొణిజర్ల మండలం పెద్దగోపతి వద్ద సాగర్ కాల్వపై లిఫ్ట్ ఏర్పాటుచేస్తే సుమారు 20వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశమున్నందున మంత్రుల దృష్టికి తీసుకెళ్లాను.

పరీక్షల యాక్షన్ ప్లాన్ అమలు చేయాలి



అధ్యాపకులతో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్మీడియట్ పరీక్షల యాక్షన్ ప్లాన్‌ను కచ్చితంగా అమలుచేయాలని డీఐఈఓ హెచ్.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 90 రోజుల యాక్షన్ ప్లాన్ గురించి అధ్యాపకులకు సూచనలు చేశారు. మార్చిలో జరిగే పరీక్షలకు ఈ ప్లాన్ ఎంతగానో ఉపయోగపడుతుందని, ప్రణాళిక ప్రకారం విద్యార్థులను చదివిస్తే అందరూ ఉత్తీర్ణత సాధిస్తారని అన్నారు.

క్లుప్తంగా

సైన్స్‌ఫేర్‌లో విద్యార్థిని శ్రీముఖి ప్రతిభ


శ్రీముఖి రాగమయి

భద్రాచలంటౌన్: పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థిని వనం శ్రీముఖి రాగమయి జిల్లాస్థాయిలో ప్రజ్ఞ కాంపిటీషన్ సైన్స్‌ఫేర్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. బహుమతితోపాటు ప్రశంసాపత్రం అందుకుంది. దీంతో పాఠశాల యాజమాన్యంతో పాటు పలువురు శనివారం విద్యార్థిని అభినందించారు.

కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి


ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

జూలూరుపాడు: కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ సూచించారు. సహకార సంఘం ఆధ్వర్యంలో జూలూరుపాడు, కాకర్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన సందర్శించారు. కొనుగోళ్లపై ఆరా తీశారు. తేమ శాతాన్ని పరిశీలించి మాట్లాడారు. తహసీల్దార్ కె స్వాతి బిందు, సొసైటీ చైర్మన్ చీమలపాటి భిక్షం, కార్యదర్శి రమణారెడ్డి, గిర్దావర్ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ సీఈఓను కలిసిన పలువురు ఉద్యోగులు


సీఈఓను కలిసిన ఎంపీడీఓలు

చుంచుపల్లి: జిల్లా ప్రజా పరిషత్ నూతన ముఖ్యకార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన బి.నాగలక్ష్మిని జిల్లా తెలంగాణ పంచాయతీ రాజ్ , రూరల్ డెవలప్‌మెంట్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ చైర్మన్ కె.ధన్‌సింగ్, తెలంగాణ మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.జమలా రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టాఫ్ నర్స్‌కు సేవా రత్న అవార్డు


శంకరమ్మకు అవార్డు అందజేస్తున్న నిర్వాహకులు

సింగరేణి(కొత్తగూడెం): రామవరం పరిధిలోని యూపీహెచ్‌సీ స్టాఫ్ నర్స్ బడికెల శంకరమ్మ సేవా రత్న అవార్డ్ అందుకుంది. శనివారం విజయవాడలో అద్దంకి రాజా పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ప్రతిభా పురస్కారాల వేడుకలో అవార్డు ప్రదానం చేశారు. అనంతరం సన్మానించారు.

వెదురు ఉత్పత్తుల పరిశీలన


క్లస్టర్ డైరెక్టర్లతో మాట్లాడుతున్న జీఎం

చంద్రుగొండ : మండల పరిధిలోని బెండాలపాడు శివారులో ఉన్న బ్యాంబో క్లస్టర్‌ను జిల్లా పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ తిరుపతయ్య శనివారం సందర్శించారు. వెదురుతో తయారు చేస్తున్న ఉత్పత్తులను పరిశీలించారు. క్లస్టర్ డైరెక్టర్లతో మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం వెదురు మొక్కల నర్సరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పృథ్వీ, క్లస్టర్ డైరెక్టర్లు బొర్రా సురేష్, మల్లం కృష్ణయ్య, పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

భద్రాచలంఅర్బన్: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 33 మందికి భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి శివనాయక్ జరిమానా విధించారు. మరో వ్యక్తికి రూ. 1000 జరిమానాతోపాటు మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ శనివారం తీర్పు చెప్పారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల కాలనీ గ్రామంలో ఏడేళ్ల బాలుడు పులగడపు ధ్రువన్ ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా వీధి కుక్కలు దాడి చేశాయి. దీంతో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. తల్లిదండ్రులు భద్రాచలం ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు.

అమలుకాని మెనూ!


రామవరం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు(ఫైల్)

పాఠశాల విద్యార్థులకు కొరవడుతున్న పోషకాహారం

- పెంచిన మెనూ చార్జీలను చెల్లించని ప్రభుత్వం
- పెండింగ్‌లో మధ్యాహ్న భోజన బిల్లులు
- ప్రస్తుత చార్జీలతో వంట చేయలేకపోతున్నామని చెబుతున్న కార్మికులు

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పాఠశాలలు, గురుకులల్లో విద్యార్థులు భోజనం తిని అస్వస్థతకు గురవుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని విద్యాలయాలను పరిశీలిస్తే మెనూ సక్రమంగా అమలు కావడంలేదని తెలుస్తోంది. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూ పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంతో విద్యార్థులు ఇంటి భోజనంపైనే మక్కువ చూపుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల మిడ్డే మీల్స్ చార్జీలు పెంచుతున్నట్లు ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆమోదించి ఆ ధరలు అమలు చేయాల్సి ఉంది. కానీ ఇంకా కార్యరూపం దాల్చలేదు. మార్కెట్లలో పెరిగిన ధరలకు, ప్రభుత్వం చెల్లించే చార్జీలు సరిపడక, మిడ్డే మీల్స్‌లో నాణ్యత, పోషక విలువలు కొరవడుతున్నాయి. విద్యార్థులకు వారానికి మూడు గుడ్లను అందించాల్సి ఉండగా, జిల్లాలోని ఏ పాఠశాలలో కూడా అమలు చేయడంలేదు. వారానికి ఒక్కటి వడ్డించడమే వంట కార్మికులకు భారంగా మారింది. ప్రస్తుతం మార్కెట్‌లో గుడ్డు ధర.7 నుంచి రూ.8 వరకు ఉంది. ప్రభుత్వం రూ. 5లే చెల్లిస్తోంది. దీంతో గుడ్లు అందించలేకపోతున్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులపై ఒత్తిడి

జిల్లాలో 1,299 పాఠశాలల్లో 63,399 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మెనూ ప్రకారం సోమవారం సాంబారు, గుడ్డు, మంగళవారం కూరగాయలు, బుధవారం సాంబారు, గుడ్డు, గురువారం ఆకుకూరలు, శుక్రవారం సాంబారు, గుడ్డుతో భోజనం, శనివారం వెజిటేబుల్ రైస్‌ను విద్యార్థులకు అందించాల్సి ఉంది. ప్రస్తుతం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి పాత చార్జీలే అమలు అవుతున్నాయి. మెనూ చార్జీలు పెంచకుండా తాము వంటచేయలేమని మధ్యాహ్న భోజన కార్మికులు చెబుతున్నారు. కాగా మెనూ సక్రమంగా అమలుకాకపోవడంతో విద్యార్థులకు పోషకాహారం అందడంలేదు. మిడ్డే మీల్స్ అమలుకు ఏర్పాటు చేసిన కమిటీలు కూడా చార్జీలు పెంచేందుకు కృషి చేయాలని మధ్యాహ్న భోజన కార్మికులు కోరుతున్నారు. ఇటీవల కలెక్టర్ సైతం వంట కార్మికులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు చేశారు. కానీ సక్రమంగా బిల్లులు, పెరిగిన చార్జీలు రాకపోవడం వల్ల వంటకార్మికులపై ఒత్తిడి పెరుగుతోంది.

గురుకులాల మాదిరిగా అమలు చేస్తే..

గురుకులాల్లో చదివే విద్యార్థులకు టిఫిన్, భోజనం కోసం ఒక్కో విద్యార్థికి రూ.50 వరకు చెల్లిస్తున్నారు. పాఠశాలల్లో మాత్రం విద్యార్థులకు 1 నుంచి 5వ తరగతి వారికి రూ.5.45, 6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు రూ.8.17, 9, 10వ తరగతి విద్యార్థులకు రూ.10.40 చొప్పున ఇస్తున్నారు. గురుకులాల మాదిరిగా ప్రభుత్వం చార్జీలు చెల్లిస్తే విద్యార్థులకు పోషకవిలువతో కూడిన సంపూర్ణ భోజనం అందే అవకాశం ఉంటుంది.

కార్మికులకు ఇబ్బందే..



మార్కెట్ ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు చెల్లించాలి. పెరిగిన చార్జీలు అమలు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. మెనూ అమలు చేయాలని హెచ్‌ఎంలు వంట కార్మికులపై ఒత్తిడి చేస్తున్నారు. కార్మికులేమో చార్జీలు సరిపడక అవస్థ పడుతున్నారు.

–సత్తెనపల్లి విజయలక్ష్మి, మిడ్డే మీల్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి

కచ్చితంగా అమలు చేయాలి



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల్లో మిడ్డే మీల్స్ మెనూను కచ్చితంగా అమలు చేయాలి. విద్యార్థులకు వారంలో మూడు రోజులు గుడ్డు తప్పనిసరిగా అందించాలి. పెరిగిన చార్జీలు ప్రభుత్వం అమలు చేస్తుంది. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా హెచ్‌ఎంలు పర్యవేక్షించాలి.

–ఎం.వెంకటేశ్వరాచారి, డీఈఓ

ఎస్టీ వర్గీకరణకు కమిషన్ నియమించాలి


మాట్లాడుతున్న రమణాల లక్ష్మయ్య

టేకులపల్లి: ఎస్టీ రిజర్వేషన్ వర్గీకరణకు కమిషన్ నియమించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంపిడి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టేకులపల్లి సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద శనివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడిగా ఎస్టీ రిజర్వేషన్లు ఉండటంతో లంబాడాలకే లాభం చేకూరుతోందని అన్నారు. ఆదివాసీ నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దుగ్గారపు వీరభద్రమ్, వట్టం కన్నయ్య, పూనెం బాలకృష్ణ, వర్స శ్రీను, చింత వెంకటేశ్వర్లు, ఈసం సాంబయ్య, సూర్ణపాక కిషన్ రావు, ఇమ్మడి నాగేశ్వర రావు, సుతారి వెంకన్న, మోకాళ్ళ కన్నయ్య, వజ్జ యర్రయ్య, ఈసం క్రిష్ణ, కణితి ప్రవీణ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

యంత్రాల పనితీరు పరిశీలన


యంత్రాల పనితీరును పరిశీలిస్తున్న ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి

దమ్మపేట: మండల పరిధిలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో యంత్రాల పనితీరును, అధికారులతో కలిసి టీజీ ఆయిల్ ఫెడ్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి పరిశీలించారు. శనివారం ఫ్యాక్టరీని సందర్శించిన ఆయన గెలల క్రషింగ్, వివిధ విభాగాల్లో రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షించారు. కాండం పొడవు తక్కువ ఉండేలా పామాయిల్ గెలలను నరకాలని అన్నారు. వార్షిక మరమ్మతుల ప్రక్రియలో భాగంగా యంత్రాల సామర్థ్యం, పనితీరును పరిశీలించారు. మార్చాల్సిన యంత్రాల విడి భాగాలపై నివేదిక రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ మేనేజర్ కళ్యాణ్, కార్తీక్, రాజేష్, శివ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిర్‌గన్‌తో బావమరిదిపై కాల్పులు

- పిల్లెట్ తొడభాగంలో దిగడంతో తీవ్ర గాయం
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

పాల్వంచ: బావ, బావమరిది మధ్య తలెత్తిన వివాదంలో బావ ఎయిర్‌గన్‌తో కాల్చడంతో బావమరిదికి తీవ్ర గాయాలైన ఘటన పాత పాల్వంచలో శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు.. పాత పాల్వంచకు చెందిన సిరాజ్ మహమ్మద్ సోదరి నజీమత్ హేరాకు ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామానికి చెందిన జిలానీతో గతంలో వివాహం జరిగింది. కాగా జిలానీ తరచూ మద్యం సేవించి నజమత్‌ను ఇబ్బంది పెట్టడంతో పాటు వివాహ సమయంలో కట్నం సరిగా ఇవ్వలేదని దూషిస్తుండేవాడు. దీంతో సిరాజ్ తన అక్కతో కలిసి కొంతకాలం తిరుమలాయపాలెంలో హోటల్ నడపగా జిలానీ అక్కడికి కూడా వచ్చి ఇబ్బంది పెడుతుండేవాడు. దీంతో మూడు నెలల క్రితం అక్కా, తమ్ముడు పాత పాల్వంచకు వచ్చేశారు. కాగా శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో జిలానీ, శ్రీకాంత్ అనే మరో వ్యక్తితో కలిసి కారులో వచ్చి సిరాజ్‌తో గొడవపడ్డాడు. ఈ క్రమంలో తన వెంట తెచ్చుకున్న ఎయిర్ గన్‌తో సిరాజ్‌పై మూడు రౌండ్లు కాల్పులు జరిపాడు. రెండుసార్లు తప్పిపోగా మూడోసారి పిల్లెట్ తొడభాగంలో దిగడంతో గాయమైంది. సిరాజ్ గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చేసరికే జిలానీ కారులో పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు జిలానీ, శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు పాల్వంచ ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

గుంతలతో రోడ్డు ప్రమాదాలు


రింగ్ రోడ్డు సెంటర్‌లో బోల్తా పడ్డ జామాయిల్ లారీ


భారీ గుంతలో ఇరుక్కున్న ప్రైవేటు స్కూల్ బస్సు

- ప్రధాన రహదారిపై లారీ బోల్తా
- విద్యార్థులతో వెళ్తున్న స్కూల్ బస్సుకూ ప్రమాదం

అశ్వారావుపేటరూరల్: జాతీయ రహదారిపై ఉన్న భారీ గుంతలతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అశ్వారావుపేటలోని రింగ్ రోడ్ సెంటర్‌లో ఫారెస్ట్ చెక్ పోస్ట్ ఎదుట, స్థానిక పేరాయిగూడెం డివైడర్(సత్తుపల్లి మార్గంలో) నుంచి రింగ్ రోడ్ వరకు రెండు వైపులా అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలోనే శనివారం ఉదయం గంటల వ్యవధిలోనే రెండు ప్రమాదాలు జరిగాయి. జామాయిల్ కర్రల లోడుతో వెళ్తున్న ఓ లారీ రింగ్ రోడ్డు సెంటర్‌లో గుంతల కారణంగా అదుపుతప్పి ప్రధాన రహదారిపైనే బోల్తా పడింది. లారీలో ఉన్న జామాయిల్ బాదులు చెల్లాచెదురుగా పడగా త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. అనంతరం గంటల వ్యవధిలోనే అశ్వారావుపేట నుంచి సత్తుపల్లికి వెళ్తున్న ఓ ప్రైవేటు స్కూల్ బస్సు కూడా అదే రింగ్ రోడ్డు సెంటర్‌లో ఉన్న గుంతల్లో ఇరుక్కుపోయింది. ఆ సమయంలో స్కూల్ బస్సులో దాదాపు 20 మందికిపైనే విద్యార్థులు ఉన్నారు. పెను ప్రమాదం తప్పడంతో విద్యార్థులంతా సురక్షితంగా బయటపడ్డారు. రోడ్లు భవనాల శాఖ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య


జేశ్వరి సాయి(ఫైల్)

అశ్వారావుపేటరూరల్: తల్లి మందలించిందని క్షణికావేశంలో ఇంటర్ విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం అశ్వారావుపేటలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని దండాబత్తుల వారి బజార్‌కు చెందిన సామినేని వెంకన్న, వరలక్ష్మి దంపతుల కుమార్తె జేశ్వరి సాయి(16) ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఉదయం కళాశాలకు వెళ్లే సమయంలో లంచ్ బాక్స్‌లో కూర విషయంలో తల్లి, కుమార్తె మధ్య వాగ్వాదం జరిగింది. ఆ తర్వాత తండ్రి వెంకన్న తన కిరాణా దుకాణం తెరిచేందుకు, తల్లి కూరగాయలు తెచ్చేందుకు వెళ్లారు. తల్లి తిరిగి ఇంటికి వచ్చిసరికే కుమార్తె వైర్‌తో ఉరివేసుకుంది. కుటుంబీకులు, చుట్టు పక్కల వారు వచ్చి ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఎస్సై యయాతి రాజు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహానికి శవ పంచనామా జరిపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి మందలించాడని మరో విద్యార్థిని..

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకుని ఉత్తీర్ణత సాధించాలని తండ్రి మందలించినందుకు ఓ విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొత్తగూడెం త్రీటౌన్ పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కొత్తగూడెం పట్టణంలోని ప్రగతినగర్‌కు చెందిన కేశబోయిన శ్రీనివాస్ కుమార్తె(17) ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. కళాశాలలో జరిగిన వివిధ పరీక్షల్లో మార్కులు తక్కువ రావడంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపం చెంది శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యార్థిని ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. అనంతరం ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందిందని వైద్యులు తెలిపారు. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పురుగుల మందు తాగి ఒకరు...

ములకలపల్లి: మద్యానికి బానిసైన వ్యక్తి శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌హెచ్‌ఓ పుల్లారావు కథనం ప్రకారం.. తిమ్మంపేట గ్రామానికి చెందిన గడిపల్లి బాబు (55) మద్యానికి బానిసై ఏపనీ చేయకుండా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఇంటి అవసరాలు చూసుకోవాలని భార్య సంధ్య శనివారం మందలించడంతో మనస్తాపం చెందాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేపి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

గుండెపోటుతో యువకుడి మృతి


కొండా సురేష్(ఫైల్)

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల కాలనీ గ్రామానికి చెందిన కొండా సురేష్(38) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. గుండె నొప్పితో కుప్పకూలగా కుటుంబ సభ్యులు భద్రాచలం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సురేష్ వాలీబాల్ క్రీడాకారుడిగా స్థానికులకు సుపరిచితుడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గ్యాస్ లీకై సామగ్రి దగ్ధం

మణుగూరు టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్యనగర్‌లో శనివారం ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి త్రుటిలో ప్రమాదం తప్పింది. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం.. సుందరయ్యనగర్‌లో ఓ హాస్టల్‌లో పనిచేసే పుష్ప తన ఇంట్లో మధ్యాహ్నం ఆహార పదార్థాలు తయారు చేసుకుంటున్న క్రమంలో ఒక్కసారిగా గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. మహిళ జుత్తుకు మంటలు అంటుకోగా, స్థానికులు రక్షించారు. స్థానికుల సమాచారంతో ఫైరింజన్‌తో వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. కాగా రెవెన్యూ అధికారులు సందర్శించి పంచనామా చేసి వివరాలు సేకరించారు.

రెండు గడ్డివాములు..

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని జగదీష్‌కాలనీలో శనివారం రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. పట్టణానికి చెందిన ఎడ్లపల్లి గోపాలకృష్ణ తన పశువుల కోసం ఇంటి దగ్గరలో ఉన్న స్థలంలో వరి గడ్డిని నిల్వ చేసుకున్నాడు. శనివారం ఉదయం గోపాలకృష్ణ దంపతులు బ్యాంక్‌కు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చేసరికి మంటలు అంటుకుని గడ్డివాములు దగ్ధమవుతున్నాయి. స్థానికుల సమాచారంతో ఫైరింజిన్‌తో అగ్నిమాపక సిబ్బందికి చేరుకున్నారు. కానీ రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ప్రమాద స్థలికి ఫైరింజన్ రాలేదు. దీంతో ఫైర్ సిబ్బంది అక్కడ ఉన్న మోటార్ ద్వారా వచ్చే నీటితో మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. కానీ గడ్డి పూర్తిగా దగ్ధమైంది. పశువుల మేత కోసం నిల్వ ఉంచిన గడ్డి దగ్ధం కావడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

పాల్వంచ: మోటార్ సైకిల్ డివైడర్‌ను ఢీకొని ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. శనివారం పాత పాల్వంచకు చెందిన అన్వేష్, భరత్ బైక్‌పై అంబేద్కర్ సెంటర్ సెంటర్ నుంచి నటరాజ్ సెంటర్ వైపు వస్తున్నారు. ఈ క్రమంలో సబ్ స్టేషన్ ఏరియాలో డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అన్వేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం తీసుకెళ్లారు.

ఆపన్నహస్తం అందించరూ..

- కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మహిళ


ఆర్థికసాయం అందజేస్తున్న బీఎల్‌ఏ సభ్యులు

దుమ్ముగూడెం : మండలంలోని పెద్ద ఆర్లగూడెం గ్రామానికి చెందిన నిరుపేద కొర్స జోగయ్య భార్య కొర్స భద్రమ్మ కొంతకాలంగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. వైద్యులు పరీక్షించి భద్రమ్మకు కంపెన్సేటెడ్ లివర్ లిమోసిస్, మైల్డ్ అనేమియా, హైపోకలేమియా కామెర్లు ఉన్నాయని తెలిపారు. దీని వల్ల లివర్ నీరుతో ఉబ్బి పోతుందని, 15 రోజులకు ఒకసారి సుమారు రూ. 10 వేల ఇంజెక్షన్ వేయించుకోవాలని, మందులు వాడాలని సూచించారు. శస్త్ర చికిత్స చేసి కాలేయ మార్పిడి చేయాలని, ఇందుకు రూ. 40 లక్షల ఖర్చు అవుతుందని తెలిపారు. రెక్కాడితేగానీ డొక్కాడని పేద కుటుంబం అంత ఖర్చు పెట్టి వైద్యం చేయించుకోలేక దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. కాగా బాధిత కుటుంబానికి బ్యూటిఫుల్ లైఫ్ అసోసియేషన్ స్వచ్ఛంద(బీఎల్‌ఏ) సంస్థ రూ.2 వేలు ఆర్థికసాయం అందించింది. సాయం చేయదలచిన దాతలు బీఎల్‌ఏ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామల రవివర్మను సంప్రదించాలని, 93909 18358 నంబరుకు ఫోన్ పే, గూగుల్ పే అవకాశం ఉందని బాధిత కుటుంబం పేర్కొంది.

నేడు యూటీఎఫ్ జిల్లా మహాసభలు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఐదో జిల్లా మహాసభలు ఆదివారం కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో బైక్ ర్యాలీ అనంతరం సభ జరుగుతుందని, ప్రారంభ సభకు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరవుతారని పేర్కొన్నారు.